23012025-DIS-04_Layout 1 1/23/2025 3:06 AM Page 1

4
నమస్తే తెలంగాణ
హైదరాబాద్
గురువారం 23 జనవరి 2025
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# ట్రంప్ ప్రకంపనలు

**అమెరికా** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండో విడత అధికార పగ్గాలను చేపట్టిన తొలి రోజే తన పాలన ఎలా ఉండబోతున్నదో రుచి చూపించారు. అదుపు తప్పి అదే పనిగా పేలుతున్న తుపాకీలోంచి తూటాలు వెలువడినట్టుగా ఆయన అధ్యక్ష ఫర్మానాలను శరపరంపరగా వెలువరించారు. ఒకటి కాదు, రెండు కాదు 78 ఫర్మానాలు. బరబరా వాటిపై సంతకాలు గెలికేసి, 'తాంబూలాలు ఇచ్చేశాను ఇక తన్నుకు చావండి' అన్నట్టుగా పెన్నులను సభికుల పైకి విసిరేశారు. ఒక్కో ఫర్మానా ఒక్కో సంచలనం. అన్నీ సుదూర పర్యవసానాలు కలిగినవే. ముఖ్యంగా భారతీయులకు ప్రత్యేకించి విపత్కరమైనవి కూడా వాటిలో ఉన్నాయి. అందులో అత్యంత కీలకమైంది జన్మతః పౌరసత్వ రద్దు నిర్ణయం. డజన్ల కొద్దీ జారీచేసిన ఫర్మానాల్లో అమెరికాను అంతర్గతంగానూ, బయటి ప్రపంచాన్ని అతలాకుతలం చేసేవి చాలానే ఉన్నాయి.

అమెరికా పూర్వవైభవ పునరుద్ధరణ నినాదంతో గెలిచిన ట్రంప్ శరణార్థులను ప్రత్యేకించి లక్ష్యంగా చేసుకుంటారనే అనుమానాలు నిజమయ్యాయి. ప్రస్తుతానికి వారి ప్రవేశాన్ని తాత్కాలికంగా స్థగితం చేశారు. మెక్సికో సరిహద్దులకు సైన్యాన్ని తరలించి మరీ కట్టుదిట్టం చేశారు. ప్యారిస్ పర్యావరణ ఒప్పందం నుంచి, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి ఉపసంహరించుకుంటూ తీసుకున్న నిర్ణయం తీవ్ర విమర్శలకు గురవుతున్నది. ఇది విశ్వవేదికలపై సభ్యదేశంగా అమెరికా తన బాధ్యతల నుంచి తప్పుకోవడం తప్ప మరోటి కాదు. మగ, ఆడ తప్ప మూడో లింగమనేది గుర్తించబోమనేది మరో తిరోగామి చర్య. అమెరికా సామాజికంగా సాధించిన ముందంజను ఇది నిర్వీర్యం చేస్తుంది. ఇండియా సహా బ్రిక్స్ దేశాలు డాలర్‌ను పక్కన పెట్టే ఆలోచనను ఆచరణలో పెడితే వంద శాతం టారిఫ్ పెంచుతాననేది మరో దుందుడుకు నిర్ణయం. వీటన్నిటి వల్ల భారత్ స్టాక్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడి ఒక్కరోజే లక్షల కోట్ల సంపద ఆవిరి కావడం గమనార్హం.

ట్రంప్ తీసుకున్న తీవ్ర నిర్ణయాలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు చైనా, యురోపియన్ యూనియన్ ట్రంప్ టారిఫ్ బెదిరింపులను తప్పుబట్టాయి. అవి రక్షణవాద వాణిజ్య విధానాల కిందకు వస్తాయని విమర్శించాయి. ఇంకోవైపు అనేక ఫర్మానాల్లోని అంశాలు అసలు అధ్యక్ష కార్యనిర్వాహక పరిధిలోకి రావనే మాట కూడా న్యాయనిపుణుల నుంచి వినిపిస్తున్నది. ఉదాహరణకు దాదాపు వందేండ్లకు పైగా అమల్లో ఉన్న జన్మతః పౌరసత్వ సంప్రదాయాన్ని తోసిపుచ్చుతూ తీసుకున్న నిర్ణయం న్యాయ పరిశీలనలో నిలవగలదా? అనేది ప్రశ్న. ఈ సరికే హక్కుల సంఘాలు కేసులు వేయడం గమనార్హం. ఒకప్పుడు అమెరికా ఐసోలేషనిస్టు విధానాలు అనుసరిస్తూ ఒంటికొమ్ము సొంటికాయలా ప్రపంచ పరిణామాలకు దూరంగా ఉండిపోయేది. కానీ రెండు ప్రపంచ యుద్ధాల తర్వాత అగ్రరాజ్యంగా, ఆర్థిక, సైనికశక్తిగా ఎదగడంతో భూమి మీదగల సమస్త దేశాలతో అనుబంధం పెనవేసుకుపోయింది. వాణిజ్య ప్రయోజనాల కోసం దానిని బలిచేయడం సమర్థనీయం కాదు. ప్రపంచ శాంతి, సమృద్ధిలో అమెరికా తనవంతు సానుకూల పాత్ర పోషించాల్సి ఉన్నది.

# సేతానం ఉరికి.. సర్కారే తలారి



డాక్టర్ ఆంజనేయ గౌడ్

ఆదిలాబాద్ అన్నదాత తెలంగాణకు ఏదో చెప్పాలనుకున్నాడు. ఆ అమరుడైన దేవ్‌రావు ఇంతకీ మనకేం చెప్పాలనుకున్నాడు..? చెట్టుపై వాలిన పిట్ట ప్రాణాలకు ప్రమాదమొచ్చిందని చెప్పదలుచుకున్నాడా? పంట పొలాల్లో మిడతల దండు మాటేసిందని మనలందరినీ హెచ్చరించదలిచాడా? ఇదేదో తెలిపేందుకే, దేవ్‌రావు బలవన్మరణానికి బ్యాంకును వేదికగా చేసుకున్నాడు. తెలంగాణ నేల మీద అన్యాయంపై తిరుగుబాటు అనేది చారిత్రక సహజత్వం. భోళాతనం, బెబ్బులి గుణం రెండూ ఒకే ఒంట్లో ఒదిగి ఉండే మనుషుల సమూహం తెలంగాణ. ఆ స్వభావంతోనే దేశంలోనే వైవిధ్యమైన చరిత్రను తెలంగాణ సొంతం చేసుకున్నది. మరీ ముఖ్యంగా మన రైతాంగానిది రాజీలేని జీవన సౌందర్యం. సద్ది మూటల్లో ఉద్యమాలను బతికించడం దగ్గరి నుంచి, స్వయం పాలనలో సిరులను పండించడం వరకు ఇక్కడి మట్టి మనుషులది ఒడువని చరిత్ర. నిజానికి రైతు సహజ సిపాయి కదా!





అపాయాలపై, వైపరీత్యాలపై పరిపూర్ణమైన అవగాహన కలిగినవాడు. మట్టికి, మేఘానికి మధ్య, నీటికి, విత్తుకు నడుమ అడ్డంపడే కంచెలపై సంపూర్ణ జ్ఞానం రైతులకు ఉంటుంది. ఈ సహజ సిపాయి, అసహజ మరణాన్ని ఆహ్వానించడం వెనుక ఏ ఆవేదనాగ్ని ఉంటుందో తెలంగాణకు గతానుభవం నేర్పించే ఉన్నది. వ్యవస్థలపై విశ్వాసం ఆవిరైనప్పుడు, చావులోనూ సందేశాన్ని, ధిక్కారాన్ని ప్రదర్శించే సమాజం తెలంగాణ. పదేండ్ల కిందట ఊర్ల మెడకు వేలాడిన ఉరితాళ్లు, పురుగుల డబ్బాలు మోగించిన చావు మేళాలు స్వయం పాలనలో మాయమవ్వడంతో చాలామంది యాది మరిచారు. కానీ, దేవ్‌రావు ఆత్మహత్యలో నాటి మరణ మృదంగం మళ్లీ చాటింపు వేసింది. కాంగ్రెస్ సర్కార్ మోసాన్ని బ్యాంకులోనే బట్టలిప్పి నగ్నంగా నిలబెట్టి, ఊపిరి వదిలిన దేవ్‌రావు ఉదంతం జరిగి 24 గంటలు కూడా గడవకముందే, అదే ఆదిలాబాద్ జిల్లాలో రాథోడ్ గోకుల్ అనే మరో గిరిజన రైతు రుణఘాతానికి రాలిపోయాడు. ఇలా రేవంత్ రెడ్డి సర్కార్ ఏడాది పాలనలో 406 మంది రైతులు బలవన్మరణానికి బలైపోవడం ఎంత దారుణం? ఏడాదిలోనే తెలంగాణ ఎద పగలడం ఆవేదన కలిగిస్తున్నది. వాస్తవానికి ఆత్మహత్యలు లేని తెలంగాణనే కాదు, దేశం అవసరాలకూ ఆదరువుగా రాష్ర్టాన్ని నిలబెట్టింది కేసీఆర్ ప్రభుత్వం. వ్యవసాయంలో విశ్వాసాన్ని పండించి, పల్లెల్లో పండుగల ప్రభంజనం సాకారం చేసింది.

> **కేసీఆర్ ప్రభుత్వం రగిలించిన వ్యవసాయ విప్లవం వల్ల 2014కు మునుపు కోటి ఎకరాల్లో కూడా పొడవని విత్తులు, 2023 నాటికి 2.68 కోట్ల ఎకరాల్లో పచ్చని పంటగా విస్తరించింది. రాష్ట్ర ఏర్పాటు నాడు 68 లక్షల టన్నుల వరి ధాన్యం మాత్రమే ఉత్పత్తి అయితే, 2023 నాటికి 350 లక్షల టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి జరిగి, దేశంలోనే రికార్డ్‌ను మన రాష్ట్రం నమోదు చేసింది.**

తడి ఎండి తంగేడు పూల చెట్లు కూడా మొలవని ఎడారుల్లా మారిన పొలాలు, ఆకు పచ్చని పైటను తొడుక్కోవడం వెనుక కేసీఆర్ సర్కార్ పడ్డ శ్రమ ఇప్పుడు చాలామందికి అర్థమవుతున్నది. ఈ ప్రభుత్వం మా కోసమే అనే విశ్వాసం కలిగిస్తే, రైతులు రత్నాలు పండిస్తారు. అదే అన్నదాతలకు ఇది సవతి తల్లి ప్రేమ చూపుతున్న సర్కార్ అనేది మదిలో పడితే, ఒడ్డున పడ్డ చేపలా విలవిలలాడిపోతారు.

ప్రేమగల్ల ప్రభుత్వానికీ, మోసకారి సర్కార్‌కు మధ్య వ్యత్యాసాన్ని నేడు తెలంగాణ రాష్ట్రం కండ్లారా చూస్తున్నది. 24 గంటల ఉచిత విద్యుత్తు కోసం రూ.36,899 కోట్లు, రైతుబంధు కోసం రూ.73 వేల కోట్లు, బీమా కోసం 6,861 కోట్లు, వరిధాన్యం కొనుగోలు కోసమే 1,34,768 కోట్లు, ఇతర పంటల సేకరణకు రూ.11,439 కోట్లు, విత్తనాల ఎరువుల రాయితీకి రూ.983 కోట్లు, రుణమాఫీ అమలుకు రూ.30 వేల కోట్లు ఇలా ఖజానాను రైతాంగానికి వెన్నెముకగా నిలబెట్టింది కేసీఆర్ ప్రభుత్వం. సాగు నీటికి ఊటబాయిలా రాష్ర్టాన్ని మార్చేందుకు రూ.1,76,000 కోట్లు ఖర్చుచేసింది. కేసీఆర్ సర్కార్ తీసుకున్న ఎన్నో సాహసోపేత చర్యల వల్ల రైతుల కన్నీరు ఆగి, రాష్ట్రం పంటను కన్నది. పదేండ్లలో విభజన సమస్యలు, కరోనా, పెద్దనోట్ల రద్దు, కేంద్ర కొర్రీలు ఇలా ఎన్నో అవాంతరాలు సలుపుతున్నా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం, తన భుజానికెత్తుకున్న నాగలిని కిందకి దించనేలేదు. ఇవన్నీ గతంలో రాసినా, చెప్పినా ఎందుకో చాలామంది చెవికెక్కకపోయేది. కానీ, ఏడాది గడిచాక, విశ్వాస ఘాతుకానికి అలవోకగా వొడిగతున్న రేవంత్‌రెడ్డి సర్కార్ తీరును రుచి చూసిన తర్వాత, నేడు అందరికీ మనసున పడుతున్నది.

కాంగ్రెస్ సర్కార్ నమ్మబలికిన రుణమాఫీ గ్రామాల్లో ముప్పై శాతం కూడా కాక, రైతు భరోసా అసలుకే రాక, సర్వేలు, డిక్లరేషన్ ఫారమ్‌ల డ్రామాలు చూడలేక రైతుల గుండెలు మండుతున్నాయి. రైతులు ఏ ఉపద్రవాన్నైనా ఎదుర్కొంటారు కానీ సర్కార్ వెన్నుపోటును అసలుకే జీర్ణించుకోలేరు. అందువల్లనే రాష్ట్ర రైతాంగం రగిలిపోయింది. ఏడాది ఎగ్గొట్టి, స్థానిక సంస్థల ఎన్నికల కోసం కొర్రీలతో రైతులు, వ్యవసాయ కూలీలకు రైతు భరోసా అందిస్తామంటున్నారు. ఉపాధి హామీ ప్రకారం 29 లక్షల జాబ్ కార్డు దారులకు ఎలాంటి భూమి లేదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అందులోనూ 20 రోజుల పనిదినాల నిబంధన పేరిట 19 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసాను ఎగ్గొట్టే ఎత్తులు వేస్తున్నారు. ఇట్లా అన్ని హామీలకు కొర్రీలు పెడుతూ, కాంగ్రెస్ పార్టీ సర్కార్ ఎన్నికల కోసం కాకమ్మ కథలు వల్లిస్తూనే ఉన్నది.

ఒక మెతుకు చేతిలోకి తీసుకొని, బువ్వ ఉడికిందో లేదో చెప్పేసే వ్యవసాయదారులు, ఏడాది ఎగవేతల ఏలుబడిని అనుభవించిన తర్వాత రేవంత్ రెడ్డి సర్కార్‌ను ఇంకా విశ్వసిస్తారా? అసలు మాయముంతెరగని విన్యాసాల సర్కార్ అని అర్థమైపోయిన తర్వాత అన్నదాతలకు భరోసా ఎలా కలుగుతుంది? గ్యారెంటీలే కాదు నీటి కటకట, ఎరువుల కొరత ఇలా ఎన్నో ఇక్కట్లను ఈ ఏడాది అందరూ చవిచూశారు.

పైగా ఆలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు ఫార్మాల పేరిట, రకరకాల కారణాలు చెప్పి, రైతుల భూములకే ఎసరు పెట్టే ప్రయత్నాలు తీవ్రమయ్యాయి. నిన్నటికి నిన్న నాగర్‌కర్నూల్ జిల్లా మైలారంలో మైనింగ్ ముప్పును ఎదిరించినందుకు గ్రామస్థులందరినీ అరెస్ట్ చేశారు. వారికి అండగా నిలబడిన పౌర హక్కుల సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డిది నియంత సర్కార్ అని బీఆర్‌ఎస్ మాత్రమే కాదు హక్కుల సంఘాలు సైతం ఈసడించుకుంటున్నాయి.

> **వీటన్నింటికి పరాకాష్ఠగా గోదావరి, కృష్ణా జలాలను తెలంగాణ రైతులకు దూరం చేసే పన్నాగాలు పన్నుతున్నారు. కాళేశ్వరంపై ఏడాది కాలంగా జరుగుతున్న దాడి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై నిర్లక్ష్యం వెనుక హస్తం సర్కార్‌ను పురిగొల్పుతున్న అదృశ్య హస్తం మరొకటి ఉన్నదని అర్థమైపోతున్నది.**

ఎందుకిదంతా? ఎవరి కోసం ఈ పనులన్నీ? రైతులు రాలిపోతుంటే, సింగపూర్ రంగుల లోకం కథలు చెప్తున్న రేవంత్ రెడ్డి సర్కార్ తీరు దారుణం. తెలంగాణ ప్రాధాన్య రంగాలను పండబెడుతూ, ఊహల్లో ఊరేగమంటున్న కాంగ్రెస్ సర్కార్ విధానం విడ్డూరంగా ఉన్నది. రైతులు, విద్యార్థుల బలవన్మరణాలు, అక్రమ అరెస్టులు, ఎన్‌కౌంటర్లు ఇలా తెలంగాణను మళ్లీ దారి తప్పిస్తున్నారు. సర్కారే సేతానం ఉరికి తలారి పాత్ర పోషిస్తుండటం ప్రజలలో వేదనాగ్నిని రాజేస్తున్నది. ఇవన్నీ చూసిన తర్వాత రాబోయే రోజుల్లో రైతులకు, రాష్ర్టానికి మరింత ముప్పు పొంచి ఉన్నదనేది అర్థమైపోతున్నది. బహుశా మనల్నందరినీ మేల్కొనమని హెచ్చరించేందుకే కాబోలు, బ్యాంక్ సాక్షిగా రైతు దేవ్‌రావ్ కన్నుమూశాడేమో?

**(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)**

> **కాంగ్రెస్ సర్కార్ నమ్మబలికిన రుణమాఫీ గ్రామాల్లో ముప్పై శాతం కూడా కాక, రైతు భరోసా అసలుకే రాక, సర్వేలు, డిక్లరేషన్ ఫారమ్‌ల డ్రామాలు చూడలేక రైతుల గుండెలు మండుతున్నాయి. రైతులు ఏ ఉపద్రవాన్నైనా ఎదుర్కొంటారు కానీ సర్కార్ వెన్నుపోటును అసలుకే జీర్ణించుకోలేరు. అందువల్లనే రాష్ట్ర రైతాంగం రగిలిపోయింది. ఉపాధి హామీ ప్రకారం 29 లక్షల జాబ్ కార్డు దారులకు ఎలాంటి భూమి లేదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అందులోనూ 20 రోజుల పనిదినాల నిబంధన పేరిట 19 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసాను ఎగ్గొట్టే ఎత్తులు వేస్తున్నారు. ఇట్లా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోసం కాకమ్మ కథలు వల్లిస్తూనే ఉన్నది.**

# అమెరికాలో భారతీయం ఆగమాగం!



నాంచారయ్య మెరుగుమాల


అమెరికా సంయుక్త రాష్ట్రాలు. ఏకైక అగ్రరాజ్యం పేరు ఇది. అనేక జాతుల సమాహారంగా ఇది విలసిల్లుతున్నది. 'వలసొచ్చిన వారి దేశం'గా దీనికి మరో పేరున్నది. జర్మనీ నుంచి అమెరికా వచ్చి స్థిరపడిన ఒక కుటుంబ వారసుడు డొనాల్డ్ ట్రంప్ దేశాధ్యక్షుడిగా రెండోసారి జనవరి 20న ప్రమాణం చేయడంతో ప్రపంచంలో అతి గొప్ప ప్రజాస్వామ్యంగా, ఉదారవాద రాజ్యంగా అమెరికాకు ఉన్న పేరు మరింతగా బలహీనపడటానికి బలమైన బీజం పడింది. అమెరికా గడ్డపై పుట్టిన వారందరికీ పౌరసత్వం ఇచ్చే (రాజ్యాంగ సవరణ ద్వారా వచ్చిన) చట్టాన్ని ట్రంప్ రద్దు చేయడం అమెరికా ఒక దేశంగా అవతరణకు దారితీసిన ప్రజాతంత్ర మానవతా మూల సూత్రాలకు విరుద్ధం.

డొనాల్డ్ ట్రంప్ దేశాధ్యక్షుడిగా కిందటేడాది నవంబర్ మొదటి వారంలో ఎన్నికైనప్పటి నుంచీ ప్రపంచ ప్రజల్లో ముఖ్యంగా భారతీయుల్లో ఏర్పడిన భయాందోళనలు నిజమైనవేనని తేలిపోయింది. అమెరికా వచ్చి స్థిరపడేవారిలో మొదటి రెండు స్థానాల్లో ఉన్న భారతీయులకు ట్రంప్ ఆదేశాలు శరాఘాతంగా మారుతున్నాయి. ప్యారిస్ పర్యావరణ పరిరక్షణ ఒప్పందం, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలగడం, బ్రిక్స్ దేశాల సరుకులపై నూరు శాతం సుంకాల ప్రతిపాదన సహా మొదటి రోజే 26 ఆదేశాలు ట్రంప్ జారీచేసి భయోత్పాతం సృష్టించారు. మొత్తం 42 అధ్యక్ష 'ఆదేశాల'తో ఇతర దేశాల ప్రజలను బెంబేలెత్తించారు. పూర్వ అధ్యక్షుడు జో బైడెన్ గతంలో ఇచ్చిన 78 ఆదేశాలను రద్దు చేసి కొత్త 'ఇనుప తెర' పాలనకు తెరతీశారు. దాదాపు వందేండ్ల క్రితం ట్రంప్ పూర్వీకుల దేశం జర్మనీలో అవతరించిన నియంత అడాల్ఫ్ హిట్లర్ పోకడల దిశగా నేడు అమెరికా పయనిస్తున్నదా? అనే అనుమానం ఆయన తాజా నిర్ణయాలను బట్టి కలుగుతున్నది. 18వ శతాబ్దం చివరలో మానవాళికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల విలువను చాటిచెప్పిన ఫ్రెంచ్ విప్లవానికి స్ఫూర్తినిచ్చిన స్వాతంత్ర్య సమరం సాగిన అమెరికాలోనే ఇలాంటివి జరుగుతున్నాయా? ఇంతటి అమానవీయ నిర్ణయాలకు, చర్యలకు అవకాశాల 'స్వర్గం' అమెరికా ఎలా వేదిక అవుతున్నది? అసలు ట్రంప్ నిర్ణయాలు, ఆదేశాలు న్యాయ పరీక్షకు నిలుస్తాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మానవాళి ఆలోచనల రూపురేఖలు మారడానికి దోహదం చేసిన 19వ శతాబ్దపు రాజనీతి తత్వవేత్త కారల్ మార్క్స్ అమెరికా భవితవ్యం గురించి వేసిన అంచనా తప్పేమో అనే సంశయం కలుగుతున్నది. 'ఎలాంటి చారిత్రక మోతబరువు లేని అమెరికా ఎప్పటికీ మెరుగైన రాజ్యంగా మనగలుగుతుంది. ఐరోపా దేశాలకు అలాంటి అవకాశం లేదు' అంటూ ఆయన ఒక వ్యాసంలో అభిప్రాయపడ్డారు.



అమెరికా మొదటి నుంచీ ఐరోపా దేశాలకు చెందిన శ్వేత జాతీయుల రాకను ఎక్కువ ఆహ్వానించింది. అమెరికాలో కొన్నేండ్లు నివసించాక శ్వేత జాతేతరులకు పౌరసత్వం పొందే అవకాశం 20వ శతాబ్దం ప్రథమార్థంలో మాత్రమే అనేక న్యాయ పోరాటాల ద్వారా వచ్చింది. భారత సంతతికి చెందిన తొలి వ్యక్తి భగత్‌సింగ్ థిండ్‌కు సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత 1935లో అమెరికా కాంగ్రెస్ శాసనం ద్వారా పౌరసత్వం లభించింది. అయితే, డాక్టర్లు, ఇంజినీర్ల వంటి నిపుణుల అవసరం పెరగడంతో 1965లో ప్రెసిడెంట్ లిండన్ జాన్సన్ పాలనలో ఇతర దేశాల వారి రాకకు అడ్డంకులుగా ఉన్న నిబంధనలను అమెరికా సర్కారు తొలగించింది. అప్పటి నుంచి భారతీయ వైద్యులు, ఉన్నత ప్రతిభాపాటవాలున్న నిపుణులు అమెరికా వెళ్లి స్థిరపడటం వేగం పుంజుకున్నది. 1990ల చివరలో బాగా ఊపందుకున్న ఐటీ విప్లవంతో విదేశీ కంప్యూటర్ సైన్స్ నిపుణులకు అమెరికాలో డిమాండ్ పెరిగింది. దీంతో భారతీయులు పెద్ద సంఖ్యలో అగ్రరాజ్యం పోయి అక్కడ శాశ్వత నివాసం ఉండటానికి హెచ్-1బీ వీసాలు, గ్రీన్‌కార్డ్ చివరికి పౌరసత్వం ఉపయోగపడుతున్నాయి. విదేశీ నిపుణులకు జారీ చేసే హెచ్-1బీ వీసాల్లో నాలుగింట మూడొంతులు భారతీయ ప్రొఫెషనల్స్‌కే దక్కడం ఆనవాయితీగా మారింది. అలాగే అమెరికాలోని వందల విశ్వవిద్యాలయాల్లో చదువుకొనే అంతర్జాతీయ విద్యార్థుల్లో సైతం సింహభాగం భారతీయులే కావడంతో అట్లాంటిక్ మహా సముద్రం ఆవల ఉన్న ఈ విశాల దేశం భారతీయులకు ముఖ్యంగా తెలుగువారికి రెండో గమ్యస్థానంగా అవతరించింది. ఎక్కువ మంది హెచ్-1బీ వీసా కింద వెళ్లిన భారతీయులు, ఇతర దేశాల ఉద్యోగుల దంపతులకు గ్రీన్‌కార్డ్ పౌరసత్వం రావడానికి ముందు అమెరికాలో పుట్టిన పిల్లలకు ఆటోమేటిక్‌గా పుట్టుకతో (జన్మతః) వచ్చేది. ఇప్పుడు ఈ వెసులుబాటును ట్రంప్ రద్దు చేయడం అమానవీయ చర్యగా పరిగణిస్తున్నారు.

అమెరికా సంపద సృష్టిలో జనాభాలో ఒకటిన్నర శాతం భారతీయుల కృషి ఉన్నది. 1960ల్లో అమెరికా వీసా విధానాలు సరళతరం కావడం నుంచీ ఇప్పటివరకూ ఇండియా నుంచి అమెరికాకు విద్యార్థులు, ఉద్యోగులు సహా అన్నిరకాల జనం వలసలు పెరగడంతో దాదాపు 35 కోట్లున్న అమెరికా జనాభాలో వారి శాతం 1.47 శాతానికి (దాదాపు 50 లక్షల మంది) పెరిగింది. అమెరికాలో అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఒకటైన జార్జియా నగరం అట్లాంటాలోని ప్రతి ఐదుగురు డాక్టర్లలో ఒకరు భారతీయుడు ఉన్నాడంటే భారతీయుల వలసలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ■




# విప్ అంటే బానిసత్వమే



> 'విప్' అంటే భావ వ్యక్తీకరణను, స్వేచ్ఛను అడ్డుకోవడమే. దీనిని ప్రయోగించడమంటే మీ ప్రతినిధిని బానిసత్వానికి గురిచేయడమే. దీనిని అడ్డుకోవాలి. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యాన్ని పెంపొందించుకోవాలి. అంతేకానీ, విప్‌లతో బలవంతంగా ఒప్పించలేరు. ఇప్పుడు ఎన్నికవుతున్న ప్రజాప్రతినిధులకు భావ ప్రకటనా స్వేచ్ఛ ఉన్నదా?

**- జగ్‌దీప్ ధన్‌ఖడ్, ఉప రాష్ట్రపతి**

**దేశ ఆర్థిక వ్యవస్థ కొన్నేండ్లుగా మందగమనంలో సాగుతున్నది. అంచనాలను సైతం అందుకోలేక తంటాలు పడుతున్నది. ఈ నత్తనడక ప్రభావం ఎక్కువగా పడేది దేశంలోని మధ్య తరగతి పైనే. అయినప్పటికీ మన మధ్యతరగతి దీనిని నిదానంగా భరిస్తున్నదే తప్ప బహిరంగంగా ఎన్నడూ దీనిపై నోరెత్తింది లేదు. ఎందుకిలా? దేశంలోని మిగతా వర్గాలతో పోలిస్తే ఈ విషయంలో ఎక్కువ ప్రభావితమయ్యేది వారే అయినప్పటికీ ఎందుకని సర్దుకుపోతున్నారన్న ప్రశ్న ఉత్పన్నమవుతున్నది.**

# 'ఆర్థికం'పై మధ్యతరగతి మౌనం

మార్చితో ముగిసే ఈ ఆర్థిక సంవత్సరంలో వార్షిక స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు 6.4 శాతం మాత్రమే నమోదవుతుందని జాతీయ గణాంక కార్యాలయం జనవరి 7న అంచనా వేసింది. ఈసారి వృద్ధిరేటు 6.5 శాతం నుంచి 7 శాతం వరకు ఉంటుందని ఇంతకుముందు వేసిన అంచనాలను దేశం అందుకోవడం కష్టమేనని అభిప్రాయపడింది. గత నాలుగేండ్లతో పోలిస్తే ఇదే అతి తక్కువ వృద్ధిరేటు. ఈ మందగమనం ఎక్కువగా తయారీ రంగంలోనే కనిపిస్తున్నది. ఫలితంగా ఎక్కువమందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ప్రయత్నాలకు గండిపడుతున్నది. అయితే, ఈ ఆర్థిక మందగమనం కొంతకాలం పాటు కొనసాగుతుందా? లేదంటే తాత్కాలికమా? అన్న విషయాన్ని పక్కనపెడితే విదేశీ పెట్టుబడుల్లో మందగమనమే ఇందుకు కారణమని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ యూబీఎస్ భావిస్తున్నది. అయితే, ఇప్పటివరకు భారత్ చూసిన అధిక వృద్ధిరేటు కొవిడ్-19 తర్వాత ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడం మాత్రమేనని ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ఎకనమిస్ట్ చీఫ్ ప్రంజుల్ భండారీ వాదిస్తున్నారు. భవిష్యత్తులో మనం చూడబోయే వృద్ధి సంఖ్యలు 6.5కు దగ్గరగా ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు. 1990ల ప్రారంభం నుంచి భారత వృద్ధిరేటు పెరుగుతూ వస్తున్నదని, కాబట్టి ఈ మందగమనంపై ఆందోళన అవసరం లేదన్నది ఆమె వాదన.



ఆర్థిక మందగమనం వల్ల బాధితులుగా మారేది ఎక్కువగా మధ్యతరగతి ప్రజలే. కరోనా మహమ్మారికి ముందు భారత్‌లో 9.9 కోట్ల మంది మధ్యతరగతి ప్రజలు ఉన్నట్టు అమెరికన్ థింక్‌ట్యాంక్ 'ప్యూ' రీసెర్చ్ సెంటర్ నివేదిక వెల్లడించింది. అయితే, మహమ్మారి ఈ సంఖ్యను మూడోవంతుకు తగ్గించింది. ఈ విషయంలో చైనాతో పోల్చుకున్నప్పుడు మన కంటే జనాభా కొంత తక్కువే అయినప్పటికీ మధ్యతరగతి మాత్రం ఐదు రెట్లు ఎక్కువ. అయినప్పటికీ, మహమ్మారి తర్వాత ఈ సంఖ్యలో కొద్దిగా కూడా మార్పు కనిపించలేదు. మహమ్మారి తర్వాత మనదేశంలోని మధ్యతరగతిలో కొందరు తిరిగి పుంజుకున్నప్పటికీ, ఉద్యోగాల కొరత, అధిక ద్రవ్యోల్బణం వంటి నిరంతర సమస్యలు వేధించాయి. అయితే, జనాభా సంఖ్యతో పోల్చుకున్నప్పుడు ఇవి సమస్యలుగా కనిపించకపోవచ్చు.

మధ్యతరగతి కష్టాలు 2014 వరకు ఆర్థిక వ్యవస్థ దృష్టిని ఆకర్షించాయి. అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ హయాంలో రూపాయి విలువ దారుణంగా పతనమైంది. అప్పట్లో దీనిపై జోకులు కూడా పేలాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ఎన్డీయే పాలనలో రూపాయి విలువ మరింత అధ్వానమైంది. అయితే, దేశంలోని మధ్యతరగతి ప్రజల్లో అత్యధికులు ప్రభుత్వంలోని ఓ పార్టీకి విధేయులుగా ఉండటం, దానికి నమ్మకమైన ఓటు బ్యాంకుగా పనిచేస్తుండటంతో ఈ వాస్తవం మరుగున పడింది. ఆర్థిక వృద్ధి మందగమనంలో సాగుతున్నప్పటికీ వారిలో ఆగ్రహం కనిపించకపోవడానికి దీనిని కూడా ఒక కారణంగా చెప్పుకోవాలి. తాము ఇబ్బందులు పడుతున్నప్పటికీ పార్టీపై అభిమానం వారిని బయటపడనివ్వకుండా అడ్డుకుంటున్నది. భారతదేశ నిర్బంధ రాజకీయ వాతావరణం నుంచే ఇది ఉద్భవించింది. కాబట్టి ఇది కేంద్ర ప్రభుత్వం మీద వ్యతిరేకతను ఏకీకృతం చేయకుండా అడ్డుకుంటుంది. కాబట్టే ప్రజల్లో అమితమైన అసంతృప్తి ఉన్నప్పటికీ అది రాజకీయ రూపాన్ని సంతరించుకోవడం లేదు.

ఈ మొత్తానికి కారణమైన కేంద్ర ప్రభుత్వంపై దాడిని పక్కనపెట్టేసి నిశ్శబ్దంగా మారిపోయిన మీడియా పాత్ర కూడా ఇందులో కీలకమేనన్నది నిపుణుల మాట. న్యాయవ్యవస్థ, ఇతర సంస్థలు కూడా ఈ నిశ్శబ్దానికి దోహదం చేశాయి. దీనికి ఒక ఉదాహరణ కూడా చెప్పుకోవచ్చు. 2014 వరకు అవినీతిపై న్యాయ వ్యవస్థ కూడా పోరాడింది. ఆ తర్వాత అది కూడా మెతకవైఖరి అనుసరించిందన్న విమర్శలున్నాయి. మధ్యతరగతి వర్గంలా కాకుండా, దేశంలోని పేదలు తమ భౌతిక ప్రయోజనాల కోసం ఓటు వేయడానికి సిద్ధంగా ఉంటారు. అయితే, వారికి ఆర్థిక సమస్యను జాతీయ చర్చనీయాంశంగా మార్చే శక్తి లేదు. కాబట్టి మధ్యతరగతి ప్రజలు జోక్యం చేసుకునే వరకు భారతదేశ ఆర్థిక మందగమనంపై ఎలాంటి ఆగ్రహావేశాలు ఉత్పన్నం కావన్నది నిజం.

**'స్క్రోల్' సౌజన్యంతో..**